క్లుప్తంగా

నేడు గ్రామీణ తపాలా ఉద్యోగుల మహాసభ

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్‌లోని దివ్యదీప్తి భవన్‌లో హనుమకొండ పోస్టల్ డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగుల 6వ ద్వైవార్షిక మహాసభను ఆదివారం నిర్వహించ నున్నట్లు గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జరగనున్న మహాసభలో తపాలా ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లు, పలు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మహాసభకు గ్రామీణ తపాలా ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

2న 'రెడ్డి' కృతజ్ఞత సభ



హన్మకొండ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ప్రకటించడంపై మే 2న రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నగరంలోని కేఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి తెలిపారు. నగరంలోని పోస్టల్ కాలనీలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి అధ్యక్షతన సంఘం సభ్యుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేద రెడ్డి కులస్తుల బాధను గుర్తించిన కాంగ్రెస్.. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కృతజ్ఞత సభకు రెడ్డి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రావుల నర్సింహారెడ్డి, నల్ల రాజిరెడ్డి, మాదుగుల పాపిరెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జైహింద్‌రెడ్డి, చల్ల నర్సింహారెడ్డి, విజయారెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం



హన్మకొండ: హనుమకొండకు వచ్చిన రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. హరిత కాకతీయ హోటల్‌లో మంత్రిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, నాయకులు నమిండ్ల శ్రీనివాస్, నిమ్మాని శేఖర్‌రావు, పిన్నింటి అనిల్ రావు, మార్నేని వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి..



ఖిలా వరంగల్: బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్‌ను వరంగల్ డెట్టస్ హైస్కూల్ 1983 – 84వ టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవన్‌గౌడ్‌కు మెమొంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రమేష్, శ్యాంప్రసాద్, జగన్, రామ్‌ప్రసాద్, సురేష్ సింగ్, శ్రీనివాస్, భాస్కర్, కిషన్, సతీష్, సంజీవ్, వెంకట్, శ్రీధర్, దేవేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

- యువకుడి దుర్మరణం



మురళి (ఫైల్)

చిల్పూరు: ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టిన ఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి చిల్పూరు మండలంలోని వంగాలపల్లి – కరుణాపురం గ్రామాల బస్‌స్టేజీ జాతీయ రహదారిపై జరిగింది. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కొండోజు మురళి (27) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కిరాయి నిమిత్తం ఆటోలో స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్లి తిరిగి వెళ్తుండగా కరుణాపురం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన ఇండియన్ ఆయిల్ ట్యాంకర్.. ఆటోను ఢీకొంది. దీంతో మురళి కింద పడగా ట్యాంకర్‌వెనుక టైర్లు మురళి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కంటైనర్ బోల్తా..

మడికొండ: కంటైనర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన ఔటర్ రింగ్ రోడ్డుపై టేకులగూడెం మామిడి తోట వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం తెల్లవారు జామున భూపాలపల్లి నుంచి సూర్యాపేటకు బుడిద లోడుతో వెళ్తున్న కంటైనర్.. అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. దాంతో డ్రైవర్ గుగులోతు నితిన్ కాళ్లు క్యాబిన్‌లో ఇరుపోయాయి. కటర్ సహాయంతో క్యాబిన్‌ను కట్‌చేసి 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజబాబు తెలిపారు.

ఎండకు అలా.. వర్షానికి ఇలా..!

- కూరగాయల మార్కెట్‌లో అపరిశుభ్రం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారులు, వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు



మార్కెట్‌లో పేరుకుపోయిన మట్టి



బురదమయంగా మార్కెట్ ఆవరణ

వరంగల్: లక్ష్మీపురం మార్కెట్‌పై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో సమస్యలు తిష్ట వేశాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎండలు కొట్టినప్పుడు దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు.. శనివారం కురిసిన కొద్దిపాటి చినుకులకు మార్కెట్ లోపల, బయట బురద తయారు కావడంతో మరింత ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

పారిశుద్ధ్యం గాలికి..

మార్కెట్ ప్రాంగణంతో పాటు బయట చుట్టూ ఉన్న నాలుగు రహదారులను నిత్యం శుభ్రం చేయించాల్సిన అధికారులు, సిబ్బంది పారిశుద్ధ్యాన్ని గాలికి వదిలేశారు. మార్కెట్ పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు గతేడాది నెలకు రూ.98 వేల ఒప్పందంపై ఓ కాంటాక్టర్‌కు అప్పగించారు. టెండర్‌లో నిబంధనలు సరిగాలేనందున తక్కువ ధరకు టెండర్ వేశానంటూ మధ్యలోనే కాంట్రాక్టర్ తప్పుకున్నాడు. చివరకు పారిశుద్ధ్య పనులు చేస్తున్న మహిళా కూలీలకు మార్కెట్ అధికారులు అప్పగించి ప్రతినెలా రూ.98వేలు చెల్లిస్తున్నట్లు తెలిసింది. అప్పటి నుంచి కూరగాయల మార్కెట్‌లో పారిశుద్ధ్యం పడకేసింది. బిల్లుల మాత్రం యథావిధిగా చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ కాంట్రాక్ట్ గత మార్చి 31నాటికి గడువు ముగియడంతో మళ్లీ టెండర్లు నిర్వహించారు. టెండర్లలో వివరాలు సరిగా లేవని కొందరు, తక్కువ పెట్టారని మరికొంత మంది ఆరోపణలు చేయడంతో మార్కెట్ అధికారులు వాయిదా వేశారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో పాత వారికే పనులు అప్పగించి చేతులు దులుపుకున్నారు.

స్వీపింగ్ మిషన్లతో శుభ్రం చేయాలి

కూరగాయల మార్కెట్‌లో మధ్యాహ్నం వేళల్లో పుల్లల్లాంటి చీపుర్లతో చెత్తాచెదారాన్ని ఊడ్వడం వల్ల కేవలం కుళ్లిన కూరగాయలు, గడ్డి లాంటివి మాత్రమే పోతున్నాయి. కింద ఉన్న మట్టి అలానే ఉండడం వల్ల చిన్న గాలి వచ్చినా దుమ్ము లేచి కళ్లు, ముక్కుల్లోకి చేరుతోందని వ్యాపారులు, వినియోగదారులు చెబుతున్నారు. పండ్లు, కూరగాయల మార్కెట్లలో పారిశుద్ధ్య పనులు చేయించేందుకు ప్రతినెలా సుమారు రూ.2లక్షలకు పైగా మార్కెట్ కమిటీ వెచ్చిస్తోంది. కార్పొరేషన్ వద్ద చిన్న సైజు ఆటోమెటిక్ స్వీపింగ్ మిషన్లు ఉన్నాయి. వాటితో రోజు రాత్రివేళల్లో కూరగాయల మార్కెట్‌ను శుభ్రం చేయిస్తే దుమ్ము, ధూళి సమస్య ఉండదు.

అంగన్‌వాడీల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్య



ఖిలా వరంగల్: మాట్లాడుతున్న సీడీపీఓ విశ్వజ



కాశిబుగ్గ: చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్లు

ఖిలా వరంగల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు సీడీపీఓ విశ్వజ తెలిపారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు శాకరాశికుంట ప్రాంతం, ఏకశిల పరపతి సంఘం భవనంలో లక్ష్మీనగర్ సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వజ మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతో చక్కటి విద్యను అందిస్తున్నట్లు వివరించారు. చిన్నతనంలోనే చిన్నారులకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో విద్యను అందిస్తున్నట్లు విశ్వజ చెప్పారు. అనంతరం చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు, పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవం

కాశిబుగ్గ: వరంగల్ శివనగర్ సెక్టార్ చింతల్ అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సీడీపీఓ విశ్వజ హాజరై మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. అనంతరం పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన నృత్యాలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన, అంగన్‌వాడీ టీచర్లు సునీత, రాధిక, కోమల, పద్మ, అనిత, శ్రీమతిదేవి, నజీనాబేగం, నిర్మల, సువర్ణ, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడే వారిని ఆదరించండి



అభ్యర్థి సావిత్రికి బీఫారం అందజేస్తున్న రవి

వరంగల్ చౌరస్తా: నీతి, నిజాయితీ, విలువలతో ప్రజల పక్షాన పోరాడే ఎంసీపీఐ (యూ) బలపరిచిన పార్లమెంట్ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నీల రవీందర్ అధ్యక్షతన పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలి రాజకీయ అవినీతి, అక్రమాలకు కేంద్ర, రాష్ట్ర పాలకులు పాల్పడుతున్నారని విమర్శించారు. కష్టజీవులు, బహుజన రాజ్యాధికారం కోసం ఎర్ర జెండా పట్టుకుని పోరాడే ఎంసీపీఐ (యూ) అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మాస్ సావిత్రికి పార్టీ బీఫాంను అందించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లపు ఉపేందర్ రెడ్డి, గోనె కుమారస్వామి, వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, నాయకులు మంద రవి, కుసుంబ బాబురావు, కంచ వెంకన్న, నాగెల్లి కొమురయ్య, గుండెబోయిన చంద్రయ్య, గడ్డం నాగార్జున, కర్ర రాజిరెడ్డి, సుంచు జగదీశ్వర్, ఐతమ్ నాగేష్, ఎగని మల్లికార్జున్, పరికల కిషన్, గోవర్ధన్, రాజు, ప్రేమలత, ఐలయ్య, నలివెల రవి, మంద భద్రయ్య, నరసయ్య, దామెర రమేష్ పాల్గొన్నారు.

24నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్ : ఈనెల 24, 25, 26వ తేదీల్లో 6వ తెలంగాణ హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా సబ్ జూనియర్స్ (అండర్–15) బాలురకు ప్రత్యేకంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్‌బాల్ గ్రౌండ్‌తో పాటు సింథటిక్ ట్రాక్ మధ్యలో మొత్తం ఆరు గ్రౌండ్‌లలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి సుమారు 500ల మంది క్రీడాకారులు, నిపుణులు హాజరవుతారని అంచనా వేసినట్లు వెల్లడించారు. జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, టెక్నికల్ అఫిషియల్స్‌కు స్టేడియం సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉచిత భోజన ఇతర వసతులు కల్పిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 70 నుంచి 100 మంది క్రీడాకారులకు నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ శిబిరం అందించాలని స్పోర్ట్స్ అథారిటీ అధికారులను కోరామని తెలిపారు. అనంతరం టాలెంట్ పోటీల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరబోయిన సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ ఇట్యాల శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు విజయ్, నవీన్ లు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపికలు

ఈనెల 22వ తేదీన హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో పురుష, మహిళల విభాగాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంపిక నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా నిర్వహణ కార్యదర్శి పోతరాజు రాజేందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు సోమవారం ఉదయం 7గంటలకు బాక్సింగ్ హాల్ నందు హాజరు కావాలన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 26నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 2006 జనవరి 1 నుంచి 2007 డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారు ఎంపికలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ, మెడికల్ పత్రం, నాలుగు ఫొటోలు వెంట తీసుకుని రావాలని సూచించారు. ఇతర వివరాలకు 99597 11609 నంబర్‌లో సంప్రదించాలని వెల్లడించారు.

అభ్యర్థుల ఖర్చులను పక్కాగా నమోదు చేయాలి



కమిషనర్‌తో సమావేశమైన ధీరజ్

వరంగల్ అర్బన్: ఎంపీ అభ్యర్థుల ఖర్చులను పక్కాగా నమోదు చేసి, రిజిస్టర్లను సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్ సింగ్ అభిప్రాయపడ్డారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్ఓ, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో శనివారం భేటీ అయ్యారు. ఎన్నికల వ్యయ సంబంధ అంశాలపై చర్చించారు. ఏఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించి వ్యయ నమోదు రిజిస్టర్లు, రోజువారీగా సమర్పించే నివేదికలను పరిశీలించారు. ఎన్నికల ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలన్నింటిని వీడియో సర్వేలెన్స్ టీం సభ్యులు రికార్డ్ చేయాలని ధీరజ్ సూచించారు. ఈ సమావేశంలో సహాయ వ్యయ పరిశీలకులు మానస, అకౌంటింగ్ టీమ్ సిబ్బంది ఖీరా నాయక్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ధీరజ్

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్ శనివారం సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను దేవాలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు అందజేసి, మహాదాశీర్వచనం చేశారు.

ప్రైవేట్ జూనియర్ కళాశాలకు షోకాజ్ నోటీస్



వినతిపత్రం అందజేస్తున్న సంఘాల బాధ్యులు

విద్యారణ్యపురి: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు హనుమకొండ చింతగట్టు ప్రాంతంలోని కాళోజీ జూనియర్ కళాశాల (ప్రైవేట్) యజమాన్యానికి శనివారం షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు హనుమకొండ జిల్లా డీఐఈఓ గోపాల్ తెలిపారు. ఇంటర్ బోర్డు నియమ నిబంధనల ప్రకారం వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని హెచ్చరించారు.

యాజమాన్యంపై చర్య తీసుకోవాలని వినతి

వేసవి సెలవుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించరాదని ఇంటర్ బోర్డు నుంచి ఆదేశాలున్నప్పటికీ తరగతులు నిర్వహిస్తున్న కాళోజీ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు ఇంటర్ విద్యా జిల్లా అధికారి డీఐఈఓ గోపాల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ, టీఎస్ఎఫ్, బీఆర్ఎస్‌వీ, బీఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్, గిరిజన శక్తి, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల బాధ్యులు కన్నం సునీల్, హకీం నవీద్, బైరపాక ప్రశాంత్, బొట్ల మనోహర్, గడ్డం నాగార్జున, శ్రీనాథ్, అరిస్టాటిల్, మణితేజ, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

23న జాతీయ విద్యావిధానంపై సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: నూతన జాతీయ విద్యావిధానం – పర్యావసనాలపై సదస్సును కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 23న వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈమేరకు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను కేయూలోని దూర విద్య కేంద్రం ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల బాధ్యులు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో అశాస్త్రీయమైన భావజాలాన్ని పెంపొందించేందుకు నూతన జాతీయ విద్యావిధానం –2020ను తీసుకొచ్చారని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి, ఓయూ ప్రొఫెసర్ పద్మజాషా పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్, ఏబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల బాధ్యులు మొగిలి వెంకటరెడ్డి, రహమాన్, నర్సింహారావు, బాషబోయిన సంతోష్, మాలోతు రాజేష్, శివకుమార్, సాయికిరణ పృథ్వీరాజ్, జస్వంత్ పరిమళ, చరణ్, మచ్చ పవన్‌కల్యాణ్, బండారి పృథ్వీరాజ్, నరేందర్, కావేరి, అనూష, వెన్నెల, లక్ష్మి, మమత పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూళ్ల పేర్లతో మోసం



సమావేశంలో మాట్లాడుతున్న శరత్

ఖిలా వరంగల్: ఇంటర్నేషనల్ స్కూళ్ల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో శనివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలు 2024–25వ విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయని విమర్శించారు. కొన్ని స్కూళ్లలో ఇప్పుడే అడ్మిషన్లు పూర్తైనట్లు చెప్పడం బాధాకరమని వాపోయారు. బడ్జెట్ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కొంత తక్కువగా ఉన్నప్పటికీ మిగిలిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అక్రమ ఫీజుల వసూలు దందా కొనసాగుతోందని అన్నారు. కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్ల పేర్లతో పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అలాంటి వాటిని నియంత్రించడంలో ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మోటం శివకుమార్, అభిరామ్, ప్రభాస్, సంతోష్, రాజు, ఖలీల్, నరేష్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ



కేడెట్లతో హెచ్‌ఎం, ఎన్‌సీసీ అధికారులు

విద్యారణ్యపురి: ఎన్‌సీసీ వలంటీర్లకు భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ హెచ్‌ఎం జీవీ.రామారావు, ఎన్‌సీసీ అధికారి వాసు తెలిపారు. ఎన్‌సీసీ వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. పాఠశాల స్థాయిలో ఎన్‌సీసీ రెండేళ్లు పూర్తిచేసిన వలంటీర్లకు పాఠశాలలో సర్టిఫికెట్లను శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లలో ఎన్‌సీసీ శిక్షణ ద్వారా ఆయుధాల వినియోగం, డ్రిల్, మ్యాప్ లోడింగ్ అంశాలతోపాటుగా దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలు, మానసిక వికాసం పెంపొందించినట్లు వివరించారు. వెపన్ ట్రెనింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్ మొదలగు విభాగాల్లో శిక్షణ పొందాక ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు వారు తెలిపారు. ఆర్మీ అధికారులు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

'సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ ద్రోహి'



మాట్లాడుతున్న మంద కుమార్

హసన్‌పర్తి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగ ద్రోహి అని ఎంఎస్‌పీ నేత మంద కుమార్ మాదిగ ఆరోపించారు. హసన్‌పర్తిలోని అమిత్‌గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 80లక్షల మంది మాదిగలు ఉన్నారని అన్నారు. మూడు పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు రెండు స్థానాలు కేటాయించాల్సి ఉండగా ఒక స్థానం కూడా ఇవ్వలేదని వాపోయారు. పసునూరి దయాకర్‌కు టికెట్ దక్కకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మోసం చేశారని విమర్శించారు. ఈనెల 22న ఎంఎస్‌పీ వరంగల్ పార్లమెంట్ స్థాయి సమావేశాన్ని అమిత్‌గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు చెప్పారు. ఎంఎస్‌పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బండారు సురేందర్, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహేందర్, విజయ్, రాజారపు భిక్షపతి, రేణుకుంట్ల దుర్గాప్రసాద్, మేకల రమేష్, నమిండ్ల సూర్యం, బొక్క సాంబరావు, సాంబయ్య, చిరంజీవి, మొగిలి పాల్గొన్నారు.

మోడల్ ఎప్‌సెట్, నీట్

విద్యారణ్యపురి: అఖిల భారతీయ విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాలో 9 సెంటర్లలో మోడల్ ఎప్‌సెట్, నీట్ మోడల్ టెస్టును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ ఎప్‌సెట్, నీట్ ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ఉండేందుకే ఈ మోడల్ టెస్టును నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, బాధ్యులు వేల్పుల చరణ్, కుమారస్వామి, కసరబోయిన రవితేజ, కంటి పవన్, వినయ్, మాలోతు రాజ్‌కుమార్, స్పందన, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంలో శ్రీనివాస్ ఆదర్శం



రక్తదానం చేస్తున్న చిదురాల శ్రీనివాస్

హన్మకొండ అర్బన్: నగరానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్ రక్తదానంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈమేరకు నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో శ్రీనివాస్ శనివారం 59వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20ఏళ్ల క్రితం తన తోబుట్టువు శస్త్ర చికిత్స కోసం నాలుగు యూనిట్ల రక్తం అవసరం కాగా, తన స్నేహితులు రక్తం ఇచ్చినప్పటి నుంచి రక్తం ఆవశ్యకతను తెలుసుకుని అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఏడాది కనీసం మూడుసార్లు రక్తదానం చేస్తున్నట్లు వివరించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని 2017, జూన్ 2న అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ రక్తదాత అవార్డును అందుకోవడం గర్వంగా ఉందని శ్రీనివాస్ తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను రెడ్ క్రాస్ ప్రతినిధులు, సిబ్బంది అభినందించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ ఎన్నిక

హన్మకొండ: బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా కమిటీని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి ప్రకటించారు. ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా నాగవెల్లి గోపీకృష్ణ, ఉప్పు రాజు, పెసరు తిలక్ కుమార్, ఓ.కిషన్, కనుకుంట్ల అరవింద్, శ్రీనివాస్ బానాల, ఓదెల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శులుగా బండి భాస్కర్, పిట్టల రమేష్, కార్యదర్శులుగా రవివర్మ, సకినాల లింగయ్య యాదవ్, అల్లం మల్లికార్జున్, నల్లెల రాజేష్ పటేల్, ముక్కెర రాకేష్, బొల్లం శోభన్, కె.సువర్ణలత, కోశాధికారిగా ఆలుగునూరి కృష్ణంరాజు, అధికార ప్రతినిధులుగా నవ్వుల హరీష్ చారి, నాగపురి అశోక్, పెద్దమ్మ నాగరాజు, తుమ్మల సులోచనను నియమించినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా సమ్మెట సత్యనారాయణ, కత్తుల అనిల్, గంగాదేవి, చల్ల రమేష్, బొల్లం ప్రసాద్, రవీందర్, టి.యుగంధర్, గుంజె పరశురాం, సీహెచ్.రవి, కె.రఘుపతి, కాపు కృష్ణమూర్తి, తోట శివ, అదిముల శ్రీనివాస్, కుక్కల రాకేష్, పాల్లెపల్లి బాలరాజు, బూర వెంకటేశ్వర్లు, సముద్రాల రవి, గుండెబోయిన రాజు, ఆడెపు భాస్కర్, గుండెబోయిన నర్సింహ, సింగనబోయిన రాజుయాదవ్, పోతిరెడ్డి నవీన్, కందగట్ల కుమారస్వామి, నాగరాజు యాదవ్‌ను నియమించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఖిలా వరంగల్: భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని సత్యసాయినగర్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వరంగల్ చార్‌బౌళికి చెందిన అస్మా (25), రెడ్డి కాలనీకి చెందిన ఓ వ్యక్తికి మూడేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రాగా, సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. కేసు విషయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లివస్తున్న క్రమంలో అదే ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై ఫుట్‌వేర్ దుకాణం పెట్టి జీవనం సాగిస్తున్న ఎండీ.మజార్ (25) ఆమెకు పరిచయం అయ్యాడు. వారిద్దరు రహస్యంగా ఫిబ్రవరిలో పెళ్లి చేసుకున్నారు. కొద్దిరోజులు సజావుగా జరిగిన వారి సహజీవనంలో అపనమ్మకం ఏర్పడింది. దాంతో అస్మా ఒంటిపై పెట్రోల్ పోసికుని గ్యాస్ విప్పి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఆమెను మజార్ స్వయంగా ఆటోలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించాడు.